

..అవిశ్రాంత సేవలు

సీనియర్ సిటిజన్స్ పేరిట వృద్ధులు సమాజ సేవలో తమవంతు పాత్ర పోషిస్తున్నారు.

వివరాలు 8లో ▸



దొంగల ముఠా అరెస్ట్

ఆటోలను అపహరించే ముఠాను అదుపులోకి తీసుకున్నట్లు గద్వాల ఎస్పీ సృజన తెలిపారు.

వివరాలు 8లో ▸

గరిష్టం/కనిష్టం
35.4 /22.7

వాతావరణం

ఆకాశం కొంత మేర మేఘావృతమై ఉంటుంది. సాయంత్రం. రాత్రి సమయంలో ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

నేడు మంత్రి హరీశ్‌రావు పర్యటన

కల్వకుర్తి: రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్ రావు ఆదివారం కల్వకుర్తి మున్సిపాలిటీలోని పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొంటారని కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ శనివారం తెలియజేశారు. రోడ్డు మార్గాన మధ్యాహ్నం 2 గంటలకు కల్వకుర్తికి చేరుకుని సాయంత్రం 6 గంటల వరకు కల్వకుర్తిలో పర్యటించనున్నట్లు చెప్పారు. పట్టణంలో నూతనంగా నిర్మించిన పీఏసీఎస్ భవనం, మిషన్ భగీరథ పనుల ప్రారంభం, మున్సిపాలిటీకి మంజూరైన రూ.10 కోట్ల విలువైన పనులతో పాటుగా 100 పడకల ఆస్పత్రి నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నారన్నారు. మంత్రి వెంట ఉమ్మడి జిల్లా మంత్రులు నిరంజన్ రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, నాగర్‌కర్నూల్ ఎంపీ రాములు, ప్రభుత్వ విప్ గువ్వల బాలరాజుతో పాటుగా నాగర్‌కర్నూల్ జిల్లాలోని ఎమ్మెల్యేలు హాజరవుతారని చెప్పారు. మంత్రి పర్యటనతో పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేయగా.. మున్సిపల్, వైద్యారోగ్య శాఖల అధికారులు తగు చర్యలు చేపడుతున్నారు.

శనేశ్వరుడికి తిలతైలాభిషేకాలు



బిజినేపల్లి: మండలంలోని నందివడ్డెమాన్‌కి చెందిన జ్యేష్ఠాదేవి సమేత శనేశ్వరుడికి భక్తులు తమ శని గ్రహదోషములు తొలిగేందుకు తిలతైలాభిషేక పూజలు నిర్వహించారు. తెల్లవారు జాము నుంచే భక్తులు ఆలయానికి చేరుకుని పూజలు చేశారు. అనంతరం స్థానిక శివాలయంలో శివుడిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ ప్రధాన అర్చకులు గవ్వమఠం విశ్వనాథశాస్త్రి, అర్చకులు, తదితరులు భక్తులకు గోత్ర నామార్చన, పూజలు చేశారు.

నల్లమలలో జంగిల్ సఫారీ పునఃప్రారంభం



మన్ననూర్: అమ్రాబాద్ టైగర్ రిజర్వు ఫారెస్ట్‌లో జంగిల్ సఫారీ ఆదివారం నుంచి పునః ప్రారంభమవుతుందని ఎఫ్‌ఆర్‌ఓ ఈశ్వర్ తెలిపారు. వన్యప్రాణుల బ్రీడింగ్ సమయం అయినందున మూడు నెలలపాటు సఫారీని నిలిపివేసినట్లు పేర్కొన్నారు. డీఎఫ్‌ఓ రోహిత్‌రెడ్డి ఆదేశాల మేరకు జంగిల్ సఫారీని పునః ప్రారంభించినట్లు తెలిపారు. ప్రకృతి ప్రియులు, వన్యప్రాణుల ప్రేమికుల కోసం అక్టోబర్ నుంచి ప్రతి నిత్యం సఫారీ వాహనాలు అందుబాటులో ఉంటాయన్నారు. పర్యాటకులకు సూచనలు, సలహాలు ఇచ్చేందుకు ప్రతి వాహనం వెంట అనుభవజ్ఞులైన నేచర్ గైడ్స్ ఉంటారని తెలిపారు. వర్షాకాలం కావడంతో అటవీ ప్రాంతం ఆహ్లాదంగా ఉండటంతోపాటు వన్య ప్రాణుల సంచారం కూడా పర్యాటకులను ఎంతగానో ఆకట్టుకునేదిగా ఉంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. సఫారీ సమయం ఉదయం 9నుంచి సాయంత్రం 4గంటల వరకు ఉంటుందని, ఒక్కొక్కరు రూ.2వేల చొప్పున చెల్లించాల్సి ఉంటుందన్నారు. వాహనంలో ఏడుగురికి మాత్ర మే అనుమతి ఉంటుందని తెలిపారు.

బీజేపీ సమరశంఖం..

నేడు పాలమూరుకు ప్రధాని మోదీ



అమిస్తాపూర్‌లో ముస్తాబైన పాలమూరు ప్రజాగర్జన బహిరంగ సభ వేదిక

- రూ.13,545 కోట్లతో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు
- అమిస్తాపూర్‌లో ప్రజాగర్జన బహిరంగసభ
- 2 లక్షల మంది జనసమీకరణ.. ఏర్పాట్లు పూర్తి
- కాషాయమయంగా మారిన మహబూబ్‌నగర్

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: రాష్ట్రంలో రానున్న అసెంబ్లీ ఎన్నికలకు పాలమూరు నుంచే శంఖారావం పూరించేందుకు భారతీయ జనతా పార్టీ సమాయత్తమైంది. ఆదివారం ప్రధాని నరేంద్ర మోదీ పర్యటనకు సర్వం సిద్ధం చేసింది. దాదాపు 13,545 కోట్ల విలువైన వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలతో పాటు పాలమూరు ప్రజాగర్జన పేరిట భారీ బహిరంగసభకు ఇటు అధికార యంత్రాంగం, అటు పార్టీ నేతలు పకడ్బందీగా ఏర్పాట్లు చేశారు. ప్రధాని రాక నేపథ్యంలో మూడంచెల భారీ భద్రతతో పాటు ఎక్కడ కూడా అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీస్‌శాఖ పటిష్ట చర్యలు చేపట్టింది.

2 లక్షల మంది జనసమీకరణ

సభకు ఉమ్మడి జిల్లాతో పాటు రంగారెడ్డి, హైదరాబాద్ నుంచి దాదాపు రెండు లక్షల మందిని తరలించేలా బీజేపీ నేతలు కసరత్తు పూర్తి చేసినట్లు తెలుస్తోంది. ఆ పార్టీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ, జాతీయ కార్యవర్గ సభ్యుడు జితేందర్‌రెడ్డి తదితరులు మోదీ పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లను పర్యవేక్షించడంతో పాటు ఉమ్మడి జిల్లాలోని 14 నియోజకవర్గాలకు సంబంధించి జనసమీకరణపై పలువురి నేతలకు దిశానిర్దేశం చేశారు. ఈ మేరకు జనాలను తరలించేలా వాహనాలను సమకూర్చారు.

షెడ్యూల్ ఇలా..



ప్రధాని ఆదివారం మధ్యాహ్నం శంషాబాద్‌లోని రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి నేరుగా మహబూబ్‌నగర్‌కు చేరుకోనున్నారు. భూత్పూర్ మున్సిపాలిటీ పరిధి అమిస్తాపూర్‌లోని ఐటీఐ కళాశాల మైదానంలో సుమారు 26 ఎకరాల్లో ఏర్పాటు చేసిన సభా ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఓ స్టేజీ వద్ద ముందుగా రహదారులు, రైలు మార్గాలు, పెట్రోలియం, సహజ వాయువు, ఉన్నత విద్య తదితర రంగాలకు సంబంధించిన ప్రాజెక్ట్‌లకు సంబంధించి వర్చువల్‌గా శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్నారు. అనంతరం గుజరాత్ నుంచి వచ్చిన ఓపెన్ టాప్ జీపులో ప్రజలకు అభివాదం చేస్తూ మోదీ రెండో వేదిక వద్దకు చేరుకోనున్నారు. అక్కడ ప్రజలనుద్దేశించి ప్రసంగించనున్నారు.

'పాలమూరు'పైనే సర్వత్రా ఆసక్తి..

దేశ ప్రధానిగా నరేంద్ర మోదీ రెండో సారి పాలమూరుకు వస్తున్నారు. 2019లో జరిగిన సాధారణ ఎన్నికల సమయంలో ఆయన మహబూబ్‌నగర్‌లో నిర్వహించిన భారీ బహిరంగసభకు హాజరయ్యారు. తాజాగా అసెంబ్లీ ఎలక్షన్లకు ముందుగా ఆయన ఎన్నికల శంఖారావం పూరించేందుకు పాలమూరును ఎంచుకోవడం ప్రాధాన్యాన్ని సంతరించుకోగా.. పాలమూరు – రంగారెడ్డి ప్రాజెక్ట్ అంశంపై ఆయన ఏం మాట్లాడతారనే దానిపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఈ ప్రాజెక్ట్‌కు జాతీయ హోదా కల్పించకుండా, కృష్ణానదిలో వాటా తేల్చకుండా మోసం చేశారని అధికార బీఆర్‌ఎస్ నేతలు ఘాటు విమర్శలు గుప్పిస్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆయన ఏం మాట్లాడుతారు.. వరాలు కురిపిస్తారా.. అనే చర్చ జోరుగా సాగుతోంది.

పోలీసుల భారీ బందోబస్తు



సభ వద్ద పోలీసుల భారీ బందోబస్తు

- సభా ప్రాంగణాన్ని ఆధీనంలోకి తీసుకున్న ఎస్పీజీ
- డాగ్, బాంబ్ స్క్వాడ్ విస్తృత తనిఖీలు
- ఏడుగురు ఎస్పీల పర్యవేక్షణ
- సుమారు 2 వేల మంది సిబ్బందికి విధులు

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్ : ప్రధాని నరేంద్ర మోదీ ఇఆదివారం మహబూబ్‌నగర్‌కు రానున్న నేపథ్యంలో పోలీస్‌శాఖ భారీ బందోబస్తు ఏర్పాట్లు చేసింది. అమిస్తాపూర్‌లోని సభా ప్రాంగణాన్ని ఎస్పీజీ అదుపులోకి తీసుకోవడంతో పాటు డాగ్, బాంబ్ స్క్వాడ్ బృందాల ఆధ్వర్యంలో విస్తృత తనిఖీలు నిర్వహించింది. ఇటు పట్టణం, అటు భూత్పూర్ నుంచి సభా ప్రాంగణానికి వచ్చే ప్రధాన రహదారిలో కాన్వాయ్ కోసం కేంద్ర బలగాలు శనివారం ట్రయల్స్ నిర్వహించాయి. సభా స్థలం సమీపంలో ఏర్పాటు చేసిన మూడు హెలీప్యాడ్‌లలో హెలీకాప్టర్ ల్యాండింగ్‌కు ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ అధికారులు ట్రయల్స్ నిర్వహించారు. కేంద్ర బలగాలతో పాటు రాష్ట్ర పోలీస్ బలగాలు సైతం ప్రధాని బందోబస్తు విధుల్లో పాలుపంచుకుంటున్నాయి.

ఏడుగురు ఎస్పీలు..

8 మంది ఏఎస్పీల ఆధ్వర్యంలో..

ప్రధాని రాక నేపథ్యంలో ఉమ్మడి పాలమూరుతో పాటు పక్క జిల్లాల్లోని పోలీస్ సిబ్బంది భారీగా జిల్లాకేంద్రానికి చేరుకున్నారు. మొత్తం ఏడుగురు ఎస్పీల పర్యవేక్షణలో ఎనిమిది మంది అడిషనల్ ఎస్పీలు, 18 మంది డీఎస్పీలు, 55 మంది సీఐ/ఆర్ఐలు, 170 మంది ఎస్ఐ/ఆర్ఎస్ఐలు, 1640 మంది ఏఎస్ఐ/హెడ్ కానిస్టేబుళ్లు/కానిస్టేబుళ్లు/హోంగార్డులు విధులు నిర్వర్తించనున్నారు. వంద మీటర్లకు ఒక పోలీస్ సిబ్బందిని నియమించడంతో పాటు ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా జాగ్రత్త చర్యలు తీసుకున్నారు. పార్కింగ్ ప్రాంతాల్లో సుమారు 550 మందికి విధులు కేటాయించినట్లు ఎస్పీ కె.నరసింహ వెల్లడించారు.

ట్రాఫిక్ మళ్లింపు.. పార్కింగ్ ఇలా..

- మహబూబ్‌నగర్ పట్టణం నుంచి భూత్పూర్ వైపు భారీ వాహనాలకు అనుమతి లేదు. సభకు వచ్చే వాహనాలకు మాత్రమే అనుమతి ఉంది. సాక్షి గణపతి ఆలయం సమీపంలో ఇరువైపులా ఏర్పాటు చేసిన పార్కింగ్ ప్రదేశాల్లో వాహనాలు పార్కింగ్ చేయాలి.
- హైదరాబాద్, జడ్చర్ల వైపు నుంచి మీటింగ్‌కు వచ్చే వాహనాలకు భూత్పూర్ ఫ్లైఓవర్ ప్రారంభంలోని ఫంక్షన్ హాల్ పక్కనున్న ఖాళీ స్థలాన్ని కేటాయించారు.
- నాగర్‌కర్నూల్ వైపు నుంచి వచ్చే వాహనాలకు కరివెన గేటు వద్ద పార్కింగ్ చేసేలా ఏర్పాట్లు చేశారు.
- గద్వాల, కర్నూలు నుంచి మీటింగ్‌కు వచ్చే వాహనాల కోసం హైవే మీద ఉన్న టాటా మోటార్స్ వెనకాల పార్కింగ్ ప్రదేశం ఏర్పాటు చేశారు.
- మహబూబ్‌నగర్ పట్టణం నుంచి భూత్పూర్‌కు వెళ్లేందుకు వాహనాలకు అనుమతి లేదు. జడ్చర్ల హైవే మీదుగా హైదరాబాద్, కర్నూలు దారికి ట్రాఫిక్‌ను మళ్లించేలా పోలీసులు బారికేడ్లు ఏర్పాట్లు చేశారు.
- రాయచూరు, తాండూర్‌కు వెళ్లే వాహనాలను జడ్చర్ల దగ్గర ఫ్లైఓవర్ దిగి మహబూబ్‌నగర్ పట్టణం మీదుగా వెళ్లేలా మళ్లిస్తున్నారు.

కొనుగోళ్లు సాగేనా?



బిజినేపల్లి శివారులో రైతు సాగు చేసిన పత్తిపంట

- ఈ ఏడాది 17 కేంద్రాల ఏర్పాటుకు సన్నాహాలు
- ఈ నెల చివరి వారంలో ప్రారంభించేలా ప్రయత్నాలు
- క్వింటాలుకు రూ.7,020 ప్రభుత్వ ధర

జిల్లాలో 2,24,766 ఎకరాల్లో పత్తి సాగు

నాగర్‌కర్నూల్: రెండు సంవత్సరాలుగా సీసీఐ కొనుగోలు కేంద్రాల ఊసే ఎత్తని సీసీఐ అధికారులు ఈ ఏడాది తిరిగి ప్రారంభించేందుకు సిద్ధమవుతున్నారు. ఇందు కోసం నాగర్‌కర్నూల్ జిల్లాలో 17 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసేందుకు రైతుల నుంచి పత్తికొనుగోలు చేసేలా ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు. 2022, 2023 సంవత్సరాల్లో పత్తి కొనుగోళ్లకు కేంద్రాలను ఏర్పాటు చేయకపోవడంతో దాదాపు ప్రైవేటులోనే రైతులు తమ పత్తి పంటను విక్రయించుకోవాల్సి వచ్చింది. అయితే ప్రభుత్వం ఇస్తున్న మద్దతు ధర కంటే బహిరంగ మార్కెట్‌లో పత్తి ధర అధికంగా ఉండటంతో రైతులు కొనుగోలు కేంద్రాల గురించి కూడా పెద్దగా ఆలోచించలేదు. ప్రభుత్వం నిర్ణయించిన ధర రూ.6 వేల వరకు ఉంటే బహిరంగ మార్కెట్‌లో రూ.10 వేల వరకు పలికింది. దీంతో రైతులు బయటి మార్కెట్‌లోనే అమ్ముకున్నారు. కానీ చాలా చోట్ల తేమ శాతం సాకుగా చూపి రైతులను మోసం చేసిన సంఘటనలు కూడా అక్కడక్కడ జరగడం రైతులను కొంత నష్టపరిచింది.

17 కేంద్రాల ఏర్పాటుకు సన్నాహాలు..

జిల్లాలోని నాగర్‌కర్నూల్, కొల్లాపూర్, అచ్చంపేట, కల్వకుర్తి పరిధిలో 17 జిన్నింగ్ మిల్లులు ఉండగా.. అన్నింట్లో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. జిల్లాలో 2,24,766 ఎకరాల్లో పత్తి సాగు చేయగా.. 28 లక్షల క్వింటాళ్ల దిగుబడి వస్తున్నట్లు అధికారులు అంచనా వేశారు. ప్రస్తుత వర్షాభావ పరిస్థితులు, తెగుళ్ల కారణంగా పత్తి దిగుబడిపై కొంత ప్రభావం చూపే అవకాశం ఉన్నట్లు తెలుస్తుంది. ప్రస్తుతం ప్రభుత్వం క్వింటాలు పత్తికి రూ.7,020గా ధరను నిర్ణయించింది. ఒకవేళ బహిరంగ మార్కెట్‌లో పత్తికి పెద్దగా ధర లేకుంటే రైతులకు కొనుగోలు కేంద్రాల అవసరం ఉంటుంది. కానీ బహిరంగ మార్కెట్‌లో గతేడాది మాదిరి రూ.10 వేల వరకు ధర పలికితే మాత్రం కొనుగోలు కేంద్రాలు పెద్ద ఉపయోగం ఉండకపోవచ్చు. సీసీఐ ఏర్పాటు చేసే కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు తమ పంటను అమ్ముకుంటే రైతులు మోసపోయే అవకాశం ఉండదు. బహిరంగ మార్కెట్‌లో అయితే తేమపేరుతో రైతులకు నిర్ణయించిన ధర కంటే తక్కువగా ఇచ్చే అవకాశం ఉంటుంది. కొనుగోలు కేంద్రాల్లో పత్తి అమ్మే రైతులు పత్తిలో తేమ శాతం 8 నుంచి 12 శాతం వరకు ఉండేలా చూసుకోవాల్సిన అవసరం ఉంది.

ఈ నెల చివరి వరకు ప్రారంభిస్తాం



జిల్లాలో 17 పత్తికొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశాం. కొనుగోలు కేంద్రాలకు పత్తి తీసుకొచ్చే ప్రతి రైతు ఖాతాకు ఆధార్ అనుసంధానం అయి ఉండాలి. ప్రభుత్వం క్వింటాలుకు రూ.7,020 మద్దతు ధర చెల్లిస్తుంది.

– బాలమణి, మార్కెటింగ్ ఏడీ

ఆధార్ అనుసంధానం ఉండాల్సిందే..

నాగర్‌కర్నూల్ జిల్లాలో ఏర్పాటు చేసే కొనుగోలు కేంద్రాలు ఈ నెల చివరి వరకు ప్రారంభం కానున్నాయి. పత్తి కొనుగోళ్ల, చెల్లింపులు, ఇతరత్రా విషయాల్లో పారదర్శకత కోసం రైతుల బ్యాంక్ ఖాతాకు ఆధార్‌కార్డుల అనుసంధానం ఉండాలనే నిబంధనను పెట్టారు. పత్తికొనుగోలు సమయం నాటికి రైతులు తమ ఖాతాను ఆధార్‌తో అనుసంధానం చేసి ఉంటేనే కొనుగోలు చేస్తామని అధికారులు చెబుతున్నారు.

ఎస్సీ, ఎస్టీ కేసులు పూర్తిచేయాలి

అదనపు కలెక్టర్ సీతారామారావు

నాగర్‌కర్నూల్: ఎస్సీ, ఎస్టీలపై దాడులు, దౌర్జన్యాలకు సంబంధించి తక్షణమే స్పందించి కేసు నమోదు చేసి త్వరితగతిన విచారణ జరిపినప్పుడే సరైన న్యాయం అందించగలుగుతామని రెవెన్యూ అదనపు కలెక్టర్ సీతారామారావు అన్నారు. శనివారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో ఏర్పాటు చేసిన ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. పోలీస్‌స్టేషన్‌కు ఫిర్యాదు వచ్చిన వెంటనే ఎఫ్ఐఆర్ నమోదు చేయాలన్నారు. ఎస్సీ, ఎస్టీలపై దాడులకు సంబంధించి వివిధ సెక్షన్ల కింద 47 రకాల కేసులు నమోదు చేసేందుకు, నష్టపరిహారం అందించేందుకు చట్టం రక్షణ కల్పించిందన్నారు. కేసు తీవ్రతను బట్టి ప్రాథమికంగా ఎఫ్ఐఆర్ నమోదు స్థాయిలో బాధితులకు 25 శాతం, చార్జ్‌షీట్ దాఖలులో 50 శాతం, కోర్టు విచారణ పూర్తయిన తర్వాత మరో 25 శాతం నష్టపరిహారం అందించనున్నారన్నారు. జిల్లాలో ఎస్సీ, ఎస్టీ దాడులకు సంబంధించి ఇప్పటి వరకు 359 కేసులు నమోదు కాగా అందులో 262 కేసులపై చార్జ్‌షీటు దాఖలు చేశామని, ఇందులో 338 కేసులకు సంబంధించి బాధితులకు రూ.4,48,61,250 నష్టపరిహారం మంజూరు చేసి అందించామన్నారు. మరో 18 కేసుల్లో బాధితుల నుంచి బ్యాంకు తదితర వివరాల సమాచారం సేకరించి వారందరికీ నష్టపరిహార డబ్బులు విడుదల చేస్తామన్నారు. అత్యాచార కేసులోని ముగ్గురు బాధితులకు ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చామన్నారు. మరో మూడు కేసులను రిజెక్ట్ చేశామన్నారు. పలు కేసుల్లో పెండింగ్ ఉన్న ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని అదనపు ఎస్పీకి సూచించారు.



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ సీతారామారావు

పోలీస్ శాఖ కృషి..

అడిషనల్ ఎస్పీ రామేశ్వర్ మాట్లాడుతూ.. ఎస్సీ, ఎస్టీ కేసుల పరిష్కారానికి పోలీస్ శాఖ కృషి చేస్తుందన్నారు. విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు బాలరాజ్ మాట్లాడుతూ.. బాధ్యులకు వెంటనే నష్టపరిహారం చెల్లించాలన్నారు. అంతకు ముందు జిల్లా ఎస్సీ కార్పొరేషన్ అధికారి రామ్ లాల్ మాట్లాడుతూ.. జిల్లాలో 17 ఎస్సీల హత్యలు, 11 అత్యాచారాలు, ఒక గ్యాంగ్ రేప్‌పై కేసు నమోదయ్యిందన్నారు. సమావేశంలో కల్వకుర్తి డీఎస్పీ పార్థసారథి, నాగర్‌కర్నూల్, కల్వకుర్తి, కొల్లాపూర్ ఆర్డీఓలు వెంకట్ రెడ్డి, శ్రీను నాయక్, నాగరాజు, జిల్లా ట్రైబల్ వెల్ఫేర్ అధికారి కమలాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సైన్స్ డ్రామా ఫెస్టివల్ పోటీలకు విద్యార్థుల ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న జిల్లా సైన్స్ అధికారి కృష్ణారెడ్డి

కందనూలు: రాష్ట్ర స్థాయి సైన్స్ డ్రామా ఫెస్టివల్ పోటీలకు ఇద్దరు విద్యార్థులు ఎంపికైనట్లు జిల్లా సైన్స్ అధికారి కృష్ణారెడ్డి తెలియజేశారు. శనివారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో మండల స్థాయిలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు జిల్లా స్థాయి సైన్స్ డ్రామా ఫెస్టివల్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆహార భద్రత అనే అంశంపై ప్రదర్శన ఇచ్చిన జెడ్పీహైస్కూల్ నాగర్‌కర్నూల్ విద్యార్థి మొదటి స్థానంలో నిలిచిందని, సమాజంలో మూఢనమ్మకాలు అనే అంశంపై ప్రదర్శన ఇచ్చిన కేజీబీవీ కోడేరు రెండో స్థానంలో నిలిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పేర్కొన్నారు. ఈ నెల చివరి వారంలో రాష్ట్ర స్థాయి పోటీలు హైదరాబాద్‌లో నిర్వహిస్తారని పేర్కొన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు రవి, న్యాయ నిర్ణీతలు చాంద్ పాషా, మురళీధర్ రావులతో పాటు ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



అభినందిస్తున్న ఎస్‌జీఎఫ్ జిల్లా శాఖ సభ్యులు

ఎస్‌జీఎఫ్ పోటీల్లో ..

వనపర్తి జిల్లాలోని పెద్దగూడెంలో నిర్వహించిన 67వ ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీల్లో అండర్ 14 విభాగంలో జిల్లాకు చెందిన క్రీడాకారులు మొదటి బహుమతి సాధించి, రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఎస్‌జీఎఫ్ కార్యదర్శి ప్రసాద్ గౌడ్ తెలిపారు. రాష్ట్ర స్థాయికి ఎంపికైన నందిని, మనీషా, గౌతమి, గాయత్రి, బాలుర విభాగంలో జగన్, చందు, శివ, దామోదర్‌లను ఎస్‌జీఎఫ్ మాజీ కార్యదర్శి వెంకటయ్య, వ్యాయామ ఉపాధ్యాయులు, రమేష్, కుమారస్వామి అభినందించారు.

రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో..




సౌత్‌జోన్ జూనియర్ రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొన్న జిల్లా క్రీడాకారులు

కందనూలు: కరీంనగర్ పట్టణ సమీపంలోని తెలంగాణ స్పోర్ట్స్ స్కూల్‌లో కొనసాగనున్న సౌత్ జోన్ జూనియర్ రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ చాంపియన్ షిప్ పోటీలకు 35 మంది జిల్లా క్రీడాకారులు ఎంపికై నట్లు జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సోలపోగుల స్వాములు తెలియజేశారు. పోటీల్లో జిల్లా క్రీడాకారులు అత్యుత్తమ ప్రదర్శన చేసి, పతకాలు సాధించి, ఓవరల్, వ్యక్తిగత సాధించి చాంపియన్‌షిప్‌లో జిల్లాకు పేరు తీసుకురావాలని కోరారు. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులకు వైద్యుడు విజయ్‌కుమార్ క్రీడా దుస్తులు అందజేశారు.

'ప్రతిపక్షాలు సొంత ప్రయోజనాలకు పరిమితం'

బిజినేపల్లి: కావేరీ జలాల వివాదాలపై ఆయా రాష్ట్రాల్లో ప్రతిపక్షాలు ఒకటైతే, మన రాష్ట్రంలోని ప్రతిపక్ష నాయకులు సొంత ప్రయోజనాలకు పరిమితమయ్యారని, గత సీఎంలు, పీఎంలు వేసిన పునాది రాళ్లతో ఏకంగా ఒక ప్రాజెక్టునే కట్టవచ్చని ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి అన్నారు. శనివారం తిమ్మాజిపేట మండలంలోని పోతిరెడ్డిపల్లిలో విలేకరులతో మాట్లాడారు. పాలమూర్– రంగారెడ్డిని బీఆర్‌ఎస్ ప్రభుత్వం నిర్మిస్తుంటే, ప్రతి పక్షాలు దాని హర్షించేది పోయి, జూరాల, శ్రీశైలం ప్రాజెక్టుల సామర్థ్యాలు తెలియకుండా ఆరోపణలు చేస్తున్నారన్నారు. ప్రాజెక్టులపై గ్రీన్ ట్రిబ్యునల్‌లో, సుప్రీంకోర్టులో కేసులు వేసి అడ్డుకుంటుంటే, వాటిని ఎదుర్కొని ఈ ప్రాజెక్టుల ద్వారా నీటిని అందిస్తున్నామన్నారు. 2014 ఎన్నికల్లో పాలమూర్–రంగారెడ్డి ప్రాజెక్టు పూర్తి చేస్తానని చెప్పిన ప్రధాని, రేపు ఏ ముఖం పెట్టుకుని వస్తారని ఎమ్మెల్యే ప్రశ్నించారు. పాలమూర్‌కు ఎందుకు జాతీయ హోదా ఇవ్వలేదన్నారు. బీజేపీ నాయకులు చిత్తశుద్ధి ఉంటే జాతీయ హోదా ప్రకటన చేయించాలన్నారు. కృష్ణా జలాలపై వాటా తేల్చాలంటే లేటర్ ఇవ్వలేదని, మోదీకి గుజరాత్‌పై ఉన్న ప్రేమ తెలంగాణపై, పాలమూరు ప్రజలపై లేదన్నారు. పాలమూరు ప్రజల ఓట్లు, సీట్లు కావాలి కాని, వారి కష్టాలు పట్టవా అని ప్రశ్నించారు. జక్కా రఘునందన్ పాల్గొన్నారు.

సాగునీరు వృథా..



వెల్దండ: మండలంలోని గుండాల సమీపంలో ఉన్న కేఎల్ఐ కాల్వకు నీటి ప్రవాహం పెరిగి వారం క్రితం గండిపడింది. దీంతో సాగునీరంతా వృథా అవుతోందని రైతులు ఆవేదన చెందుతున్నారు. మండలంలోని చొక్కన్నపల్లి, గుండాల, బర్కత్‌పల్లి, చెర్కూర్ రైతులు వేరుశనగ, వరి తదితర పంటలు సాగు చేశారు. కేఎల్ఐ డి–82 కాల్వ నిర్మాణం చెర్కూర్ సమీపంలో అసంపూర్తిగా ఉండటంతో నీరు ముందుకు పారక తరుచూ కాల్వకు గండి పడుతోందని రైతులు వివరించారు. సంబంధిత అధికారులు స్పందించి మరమ్మతులు చేయించి సాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

క్లుప్తంగా

ఉరేసుకుని వ్యక్తి బలవన్మరణం

నవాబుపేట: మండలంలోని కూచూర్ చెందిన వ్యక్తి బలవన్మరణానికి పాల్పడినట్లు ఎస్ఐ పురుషోత్తం తెలిపారు. కూచూర్‌కు చెందిన జోగు కృష్ణయ్య(45) రెండేళ్లుగా గ్రామంలో ఖాళీగా తిరుగుతున్నాడు. శనివారం గ్రామ సమీపంలోని వ్యవసాయ పొలం వద్ద చెట్టుకు ఉరేసుకున్నాడు. మృతుడి తల్లి జోగు లక్ష్మమ్మ తెలిపిన వివరాల ప్రకారం తన కొడుకు భార్య రెండేళ్ల క్రితం అనారోగ్యంతో మృతి చెందింది. ఆయన నాటి నుంచి మనస్తాపం చెందాడని, తీరా శనివారం ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిపారు. మృతుడి తల్లి ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

బిజినేపల్లి: తిమ్మాజిపేట మండలం పుల్లగిరికి చెందిన మున్నయ్య (45) అమ్మపల్లిలో అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. ఎస్ఐ భాస్కర్‌రెడ్డి వివరాల మేరకు.. పుల్లగిరికి చెందిన మున్నయ్య, అతడి భార్య అంజమ్మ బతుకుదెరువు కోసం అమ్మపల్లికి వచ్చి ఇక్కడే నివాసముంటున్నారు. శనివారం తెల్లవారుజామున మున్నయ్య మృతి చెందడంతో మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకొచ్చారు. అతడి సోదరుడు గోపాల్.. మృతదేహాన్ని పరిశీలించి చూడగా, తలకు గాయమై రక్తస్రావం కావడం గమనించాడు. భార్య అంజమ్మ, తన మేనత్త మెన్నమ్మలపై అనుమానం వ్యక్తం చేస్తూ స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పాముకాటుకు వ్యక్తి బలి

కేటీదొడ్డి: మండలంలోని పాతపాలెం గ్రామానికి చెందిన ఆంజనేయులు (36) పాముకాటుతో మృతి చెందాడు. స్థానికుల వివరాల మేరకు.. శుక్రవారం మధ్యాహ్నం వ్యవసాయ పనులు చేస్తున్న క్రమంలో పాముకాటుకు గురయ్యాడు. కుటుంబసభ్యులు గమనించి అతడిని గద్వాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే బండ్ల తనయుడు సాయిసాకేత్ రెడ్డి ఆస్పత్రికి వెళ్లి మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి, ఆర్థికసాయం అందజేశారు. ఆయన వెంట సర్పంచ్ మహబూబ్, వెంకన్‌గౌడు, మోనేష్, నవీన్‌రెడి, కృష్ణ, ఆంజనేయులు ఉన్నారు.

బైక్ అదుపుతప్పి వ్యక్తి మృతి


చిన్నరాములు (ఫైల్)

గోపాల్‌పేట: బైక్ అదుపుతప్పి ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన రేవల్లి మండలం గాంధీనగర్ సమీపంలో శనివారం చోటుచేసుకుంది. ఎస్ఐ శివకుమార్, కుటుంబ సభ్యుల వివరాల మేరకు.. రేవల్లి మండలంలోని బండరావిపాకులకు చెందిన పూర్లకంటి చిన్నరాములు (35) స్వగ్రామంలోనే మేస్త్రీ పని చేసుకుని బతికేవాడు. శుక్రవారం వనపర్తిలో నిర్వహించిన బీఆర్‌ఎస్ బహిరంగ సభకు బైక్‌పై వెళ్లి గ్రామానికి తిరుగు ప్రయాణమయ్యాడు. మార్గమధ్యంలోని చెన్నారంలో తన బంధువుల ఇంటికి వెళ్లి కొంతసేపు ఉన్నాడు. అక్కడి నుంచి స్వగ్రామానికి వస్తుండగా, గాంధీనగర్ సమీపంలో బైక్ అదుపు తప్పడంతో కిందపడ్డాడు. ప్రమాదంలో అతడికి తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ తెలిపారు. కాగా బీఆర్‌ఎస్ సభకు వెళ్లి రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన చిన్నరాములు కుటుంబానికి రూ.20లక్షల ఎక్స్‌గ్రేషియా, ఉద్యోగం ఇచ్చి ఆదుకోవాలని బీఎస్పీ జిల్లా ఉపాధ్యక్షుడు మిద్దె మహేష్ డిమాండ్ చేశారు.

నీటిసంపులో పడి బాలుడు మృతి


గట్టు (ఫైల్)

మదనాపురం: నీటిసంపులో పడి బాలుడు మృతిచెందిన ఘటన మండలంలోని గోవిందహళ్లిలో శనివారం ఉదయం వెలుగు చూసింది. గ్రామస్తులు, బాధితుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన రాజు, శ్రీశైలమ్మ దంపతులకు ఏకైక కుమారుడు గట్టు (6). గ్రామంలో శుక్రవారం రాత్రి జరిగిన వినాయక నిమజ్జనాన్ని చూడటానికి గట్టు స్నేహితులతో కలిసి వెళ్లాడు. ఓ ఇంటి ముందు ఉన్న నీటిసంపుపై వేసిన చెక్కపై నిలబడగా అది విరిగి అందులో పడిపోయాడు. రెండు గంటలైనా తమ పిల్లాడు రాకపోవడంతో తల్లిదండ్రులు వెదకడం ఆరంభించారు. అనుమానం వచ్చి నీటిసంపులో చూడగా మృతిచెంది నీటిపై తేలియాడుతూ కనిపించారు. ఒక్కగానొక్క కుమారుడు మృతిచెందడంతో తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి.

ఇరువర్గాలపై కేసు

ధరూరు: మండలంలోని గుడ్డెందొడ్డిలో బీసీ, ఎస్సీ వర్గాలకు చెందిన వారు పరస్పర దాడులకు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. ఘటనలో పలువురికి గాయాలయ్యాయి. అంజి ఫిర్యాదు మేరకు ఏడుగురిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శివానందం గౌడ్ తెలిపారు. అదేవిధంగా తమపై కూడా దాడి చేశారని మరో వర్గానికి చెందిన రమేష్ ఫిర్యాదు చేయడంతో 9మందిపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.



మనిషి జీవన చక్రంలో వచ్చే మార్పులు బాల్యం, యవ్వనం, వృద్ధాప్యం. అయితే మనిషిగా పుట్టిన ప్రతి వ్యక్తీ తుదిశ్వాస ఉన్నంత వరకు.. ప్రతి దశలోనూ ఎంతో ఆనందంగా జీవించాలని కోరుకుంటాడు. కుమారుడిగా, కూతురిగా, నాన్నగా, అమ్మగా జీవితాంతం కష్టపడి పనిచేసి చివరకు వృద్ధాప్య దశకు చేరుకుంటారు. తన కుమారులకు, కూతుళ్లకు, మనుమళ్లకు, మునిమనుమలకు సలహాలు ఇచ్చే వయసు కూడా ఇదే. అలాంటి వయసులో ప్రతిఒక్కరూ ఏ కష్టం.. నష్టం లేకుండా హాయిగా జీవించాలని పరితపిస్తుంటారు. అందుకోసం అనుక్షణం ఆరాటపడుతుంటారు. అయితే వీరు మాత్రం అందుకు భిన్నంగా.. రిటైర్మెంట్ అయిన తర్వాత కూడా ఇంటి వద్ద ఖాళీగా ఉండకుండా సెకండ్ ఇన్నింగ్స్ ప్రారంభించి.. సమాజసేవల మేముసైతం అంటూ ఇతరులకు సహాయపడుతూ ముందుకు సాగుతున్నారు.

– సాక్షి, మహబూబ్‌నగర్ డెస్క్

నేడు ప్రపంచ వృద్ధుల దినోత్సవం

విరామ దశలో.. అవిశ్రాంత సేవలు

సమాజ సేవలో సీనియర్ సిటిజన్స్ ఫోరం

- ఆరుపదుల వయసులోనూ మేముసైతం అంటూ ముందుకు..
- రిటైర్డ్ ఉద్యోగులతో పాటు సామాన్యులు, వ్యాపారులకు సభ్యత్వం
- వృద్ధాప్యంలోనూ యువకులతో దీటుగా చురుగ్గా కార్యక్రమాలు
- మహబూబ్‌నగర్, జడ్చర్ల ఫోరం ఆధ్వర్యంలో విస్తృత సేవలు

సండే స్పెషల్

సాధారణంగా 60 ఏళ్లు దాటాక కృష్ణా.. రామా.. అంటూ ఓ మూలన కూర్చోకుండా స్వీట్–16లా యువకులతో పోటీపడుతూ సమాజసేవలో చురుగ్గా పాల్గొంటూ.. వృద్ధాప్యం మాకు భారమో.. శాపమో కాదని నిరూపిస్తున్నారు కొందరు వృద్ధులు. ఇందుకోసం సీనియర్ సిటిజన్స్ ఫోరం ఏర్పాటు చేసుకుని సమాజ సేవలో తరిస్తున్నారు. మహబూబ్‌నగర్ జిల్లాకేంద్రంలో 2015లో 15 మందితో ప్రారంభమైన ఈ ఫోరంలో ప్రస్తుతం 300 మంది చేరారు. వీరి స్ఫూర్తితో జడ్చర్లలో గతేడాది 45 మందితో ప్రారంభమైన ఫోరం అనతికాలంలోనే 400 మంది సభ్యులకు చేరింది. రిటైర్డ్ ఉద్యోగులతో పాటు 60 ఏళ్లు దాటిన సామాన్యులు, వ్యాపారులు, మేధావులందరూ ఈ ఫోరంలో సభ్యులుగా ఉన్నారు. మహబూబ్‌నగర్ ఫోరం సత్ఫలితాలు సాధిస్తుండటంతో హన్వాడ, నవాబుపేట మండలాల్లోనూ ఏర్పాటైంది. దేవరకద్ర, భూత్పూర్ మండలాల్లో కమిటీ ఏర్పాటుకు అంతా సిద్ధమైంది.


ఆస్తి తగాదాలపై జిల్లా సంక్షేమశాఖ అధికారి సమక్షంలో రాజీ కుదురుస్తున్న ఫోరం సభ్యులు (ఫైల్)


ప్రజావాణికి వచ్చిన వారికి మహబూబ్‌నగర్‌లో అన్నదానం చేస్తున్న సభ్యులు (ఫైల్)

సమస్యల పరిష్కారమే..

ప్రజల సమస్యల పరిష్కారమే పరమావధిగా సీనియర్ సిటిజన్ ఫోరం ఏర్పాటైంది. ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమానికి వచ్చేవారు దరఖాస్తులు రాయడానికి ఇతరులను ఆశ్రయించడంతో రూ.50–100 వరకు వసూలు చేయడాన్ని కొందరు సీనియర్ సిటిజన్లు గుర్తించారు. దీంతో తామే ఉచితంగా దరఖాస్తు రాసేలా నిర్ణయం తీసుకున్నారు. అప్పుడే సిటిజన్ ఫోరం ఉండాలని నిర్ణయించుకుని 15 మందితో కార్యవర్గాన్ని ఏర్పాటు చేసుకున్నారు. ప్రతివారం 'ప్రజావాణి'కి వచ్చేవారందరికీ దరఖాస్తులు రాసి ఇవ్వడం, వృదుద్ధులంటే వారిని ముందుగా అధికారుల వద్దకు తీసుకెళ్లి వినతులు ఇప్పించడం ఆరంభించారు. ఇది గమనించిన అప్పటి కలెక్టర్ రొనాల్డ్‌రోస్ 'ప్రజావాణి'కి వచ్చేవారి కోసం షెడ్డు నిర్మించారు. వారికి పక్కనే ఉన్న రేణుకా ఎల్లమ్మ ఆలయంలో మధ్యాహ్నం ఉచితంగా భోజనం అందిస్తున్నారు. సీనియర్ సిటిజన్స్‌కు ఎలాంటి ఇబ్బంది వచ్చినా ఫోన్ ద్వారా లేదా నేరుగా సాయం అందిస్తున్నారు.

సీనియర్ సిటిజన్స్ సేవలను గుర్తించి 2019 ఆగస్టు 15న సీనియర్ సిటిజన్స్ ఫోరానికి ఉత్తమ సేవా పురస్కారాన్ని అందజేశారు. అదే ఏడాది హైదరాబాద్‌లో జాతీయ ఎల్డర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉత్తమ వయోవృద్ధుల సేవారత్న పురస్కారం అందజేశారు. రాష్ట్ర ఎక్సైజ్, క్రీడల శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ప్రత్యేక చొరవ తీసుకుని సీనియర్ సిటిజన్స్ ఫోరానికి మెట్టుగడ్డలోని పారిశ్రామిక వాడలో సమావేశపు హాల్‌ను కేటాయించారు. ఇప్పటికీ ప్రభుత్వం నిర్వహించే చైతన్య కార్యక్రమాల్లో ఫోరం సభ్యులు చురుగ్గా పాల్గొని ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. మహబూబ్‌నగర్ ఫోరంలో 150 మంది ఏటా ఒక్కో సభ్యుడు రూ.500 విరాళంగా అందిస్తున్నారు. ఈ డబ్బులతోనే సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

సేవా కార్యక్రమాలు

- పేద, ధనిక అనే వ్యత్యాసం లేకుండా 60 ఏళ్లు దాటిన వారికి ఆరోగ్య సలహాలు ఇవ్వడం, వారిలో నూతనోత్సాహం కల్పించేలా కృషి చేస్తున్నారు.
- తల్లిదండ్రులను వృద్ధాశ్రమంలో వదిలేసే పిల్లలకు కౌన్సెలింగ్ ఇచ్చి తరచుగా వారిని కలిసి గడిపేలా చూస్తున్నారు.
- నెలలో మూడు పర్యాయాలు సమావేశాలు నిర్వహించుకుని ఫోరం సభ్యులందరూ కలిసి సరదాగా గడుపుతూ ఒంటరితనం కనిపించకుండా చేస్తున్నారు.
- ప్రభుత్వ ఆస్పత్రుల్లో చికిత్సకు వచ్చే వారికి త్వరితగతిన డాక్టర్లు పరీక్షించేలా ఫోరం సభ్యులు నిత్యం అక్కడే వేచి ఉండి సేవలు అందిస్తున్నారు. ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తూ అన్నివర్గాలకు వైద్యసేవలు అందిస్తున్నారు. ప్రైవేట్ ఆస్పత్రుల సహకారంతో వృద్ధాప్యంలో వచ్చే వ్యాధులపై అవగాహన కల్పిస్తున్నారు.
- రైల్వేస్టేషన్, బస్టాండ్, ఇతర ప్రాంతాల్లో ఉండే అనాథలు, యాచకులకు దుప్పట్లు, తరచుగా భోజనం అందిస్తున్నారు.
- సదరం శిబిరాలకు వచ్చే వారికి భోజనం, స్వగ్రామాలకు వెళ్లేందుకు రవాణా ఖర్చులు చెల్లిస్తున్నారు. బాలభవన్‌లో చిన్నారులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్నారు.
- ఆస్తి తగాదాల వల్ల కలిగే అనర్థాలను వివరిస్తూ ఆయా కుటుంబాలకు రాజీ కుదిరిస్తున్నారు. లోక్ అదాలత్‌లో వచ్చిన కక్షిదారులకు మధ్యాహ్న భోజనం అందిస్తున్నారు.

జడ్చర్లలో అనూహ్య స్పందన

సీనియర్ సిటిజన్ ఫోరం ఏర్పాటు కోసం జడ్చర్లలో 2022లో నిర్వహించిన తొలి సమావేశానికి అనూహ్య స్పందన లభించింది. 45 మందితో ప్రారంభమై నేడు 400 మందికి చేరారు. వారం దరితో కమిటీ ఏర్పాటు చేసి సేవా కార్యక్రమాలు నిర్వహించేలా ప్రణాళిక రూపొందిస్తున్నారు. సభ్యుడిగా చేరే వ్యక్తితో రూ.200 వసూలు చేస్తున్నారు. ఇటీవల సభ్యత్వ రుసుం ధర రూ.300లకు పెంచారు.

విస్తృతం చేస్తున్నాం



సీనియర్ సిటిజన్ ఫోరం ద్వారా సేవలు విస్తృతం చేస్తున్నాం. ఒక్కో రంగానికి సంబంధించి కమిటీలు వేసుకుని ముందుకు సాగుతున్నాం. ఇటీవల ఓ మైనార్టీ అమ్మాయి చదువుకునేందుకు పంపకుంటే మేమంతా వెళ్లి ఇంట్లో మాట్లాడి చదువుకునేలా చేశాం. అలాగే తల్లిదండ్రులను పట్టించుకోని పిల్లలకు కౌన్సెలింగ్ ఇచ్చి సమస్య పరిష్కరించాం. మున్ముందు సేవలను మరింతగా పెంచి ప్రతి వృద్ధుడుకి అండగా ఉంటాం.

– నయిూమొద్దీన్, అధ్యక్షుడు, సిటిజన్స్ ఫోరం, జడ్చర్ల

ప్రణాళిక ప్రకారం..



సీనియర్ సిటిజన్లు అయినా మేము హక్కులతోపాటు బాధ్యతలు నిర్వర్తిస్తున్నాం. సీనియర్ సిటిజన్స్ ఫోరం ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు చేపడుతున్నాం. గతంలో అధికారుల దృష్టికి తీసుకెళ్లి రైల్వేస్టేషన్‌లో వృద్ధుల కోసం ప్రత్యేక బుకింగ్, విద్యుత్ బిల్లుల్లో చెల్లింపులకు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేయించాం. భవిష్యత్‌లో ఫోరం కార్యాలయంలో నిత్యాన్నదానం ఏర్పాటు చేయడానికి తగిన ప్రణాళిక రూపొందిస్తున్నాం.

– జగపతిరావు, అధ్యక్షుడు, సీనియర్ సిటిజన్స్ ఫోరం, మహబూబ్‌నగర్

మరిన్ని కార్యక్రమాలు



ఫోరం ఆధ్వర్యంలో భవిష్యత్‌లో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తాం. పాఠశాల స్థాయిలో విద్యార్థులకు తల్లిదండ్రులు, వయో వృద్ధుల విలువల గురించి చెప్పాలి. ప్రతినెలా ఫోరం సమావేశం నిర్వహించి సేవా కార్యక్రమాలపై చర్చించుకుంటాం. అందుకు అనుగుణంగానే ముందుకు సాగుతున్నాం.

– నాగభూషణం, ప్రధాన కార్యదర్శి, సీనియర్ సిటిజన్స్ ఫోరం, మహబూబ్‌నగర్


సభ్యుడికి ఆస్పత్రి ఖర్చుల నిమిత్తం ఆర్థికసాయం చేస్తున్న జడ్చర్ల ఫోరం సభ్యులు (ఫైల్)

అంతర్రాష్ట్ర దొంగల ముఠా అరెస్ట్

- 12 ఆటోలు స్వాధీనం


వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ సృజన

గద్వాల క్రైం: పార్కింగ్ చేసిన ఆటోలను అపహరించే అంతర్రాష్ట్ర ముఠా సభ్యులను అదుపులోకి తీసుకుని వారి నుంచి 12 ఆటోలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ సృజన వెల్లడించారు. శనివారం పట్టణ పోలీసు స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో పూర్తి వివరాలను ఎస్పీ తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన **సయ్యద్ నమీర్, మహమ్మద్ అలీం వృత్తి రీత్యా డ్రైవర్లుగా జీవనం సాగిస్తున్నారు. ఇద్దరు మంచి స్నేహితులుగా ఉంటూ వ్యసనలకు బానిసలయ్యారు. కుటుంబ పోషణకు ఆర్థికమైన సమస్యలు ఉండడంతో చిన్న చిన్న దొంగతనలు చేస్తుండేవాడు. ఇటీవల సూర్యపేట, ఆంధ్రప్రదేశ్ కర్నూల్ ప్రాంతాల్లో పార్కింగ్ చేసిన ఆటోలను అపహరించిన ఘటనలో రిమాండ్‌కు వెళ్లొచ్చారు. జైలు నుంచి విడుదలై గద్వాల పట్టణంలోని నుంకులమ్మ** మెట్టు వద్ద నిలిపి ఉన్న ఆటోను అపహరించడంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు విచారణలో భాగంగా నిందితులను గద్వాల – అయిజ పట్టణ శివారులోని ఆటోలో తిరుగుతుండగా పోలీసులు విచారించగా పలు విషయాలు వెలుగులోకి వచ్చాయన్నారు.

పట్టుబడింది ఇలా..

పట్టణంలోని నుంకులమ్మ మెట్టు కాలనీకి చెందిన ఫకృద్దీన్ ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. అయితే సెప్టెంబర్ 2వ తేదీన ఆటోను ఇంటి ఎదుట రాత్రి పార్కింగ్ చేసి ఇంట్లోకి వెళ్లాడు. ఉదయం ఆటో కనిపించకపోవడంతో పలు చోట్ల వాకాబు చేశాడు. ఎలాంటి ఆచూకీ లభించకపోవడంతో 4వ తేదీన పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకుని నిందితులను గుర్తించేందుకు సిబ్బంది గాలింపు చర్యలు చేపట్టారు. అపహరించిన ఆటోను నిందితులు రాయచూర్‌లో విక్రయించేందుకు వ్యూహం వేశారు. సరైన ధ్రువపత్రాలు లేక పోవడంతో దొంగలించిన ఆటోను కొనుగోలు చేసేందుకు నిరాకరించారు. దీంతో తిరుగు ప్రయాణంలో గద్వాలకు ఆటోలో నిందితులు వస్తున్నారు. శివారు ప్రాంతాల్లో తనిఖీ చేస్తున్న పోలీసులకు ఆటోకు సంబంధించిన పత్రాలను చూయించాల్సిందిగా కోరారు. నిందితుల వద్ద ఎలాంటి పత్రాలు లేకపోవడం, తప్పించుకునే ప్రయత్నం చేయడంతో ఇద్దరిని శుక్రవారం సాయంత్రం అదుపులోకి తీసుకుని విచారించగా, పలు కీలక సమాచారం అందించారన్నారు. పలు ప్రాంతాల్లో అపహరించిన ఆటోలను వనపర్తి జిల్లా పెబ్బేర్‌లోని లారీ ట్రాన్స్‌పోర్టు వద్ద ఐదు ఆటోలు, జడ్చర్లలోని మన్సూర్ ధాబా వెనుక ఆరు ఆటోలను పార్కింగ్ చేసినట్లు చెప్పడంతో వాటిని సైతం స్వాధీనం చేసుకున్నామని ఎస్పీ తెలిపారు.

అవార్డులు అందజేత..

కేసు ఛేదనలో సిబ్బంది సాంకేతిక పరిజ్ఞానంతో పలు అనుమానితుల ఫొటోలను గుర్తించి బృందాలను రంగంలోకి దింపు గాలింపు చర్యలు చేపట్టామన్నారు. ఇటీవల పలు ఇళ్లలో చోరీలు సైతం చోటు చేసుకోవడంతో సవాల్‌గా తీసుకుని చర్యలు తీసుకున్నామన్నారు. ఈ కేసులో ప్రతిభ కనబరిచిన సీసీఎస్ సీఐ భగవంత్‌రెడ్డి, ఎస్ఐలు రజిత, శ్రీకాంత్, రంజిత్, సిబ్బంది శ్రీనివాసులు, ప్రసాద్, సాంకేతిక నిపుణులు చంద్రయ్య, రామకృష్ణ, రమేష్‌చారిలను అభినందించి రివార్డులను అందజేశారు. నిందితులను గద్వాల కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు ఎస్పీ వివరించారు. సమావేశంలో డీఎస్పీ వెంకటేశ్వర్లు, సీఐ శ్రీనివాసులు తదితరులు ఉన్నారు.

జోగుళాంబ సన్నిధిలో ఏపీ హైకోర్టు న్యాయమూర్తి



జోగుళాంబ శక్తిపీఠం: అలంపూర్ ఆలయాలను శనివారం ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి బి.కృష్ణమోహన్ దర్శించుకున్నారు. ఆలయ కమిటీ చైర్మన్ కృష్ణయ్య, ఆలయ అర్చకులు స్వాగతం పలికారు. బాలబ్రహ్మ, జోగుళాంబ సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అర్చకులు ఆలయ విశిష్టతను వివరించి తీర్థ ప్రసాదాలు అందజేసి శేష వస్త్రంతో సత్కరించి వేద ఆశీర్వచనం చేశారు. ఆయన వెంట అలంపూర్ జూనియర్ సివిల్‌జడ్జి కమలాపురం కవిత, కోర్టు సిబ్బంది చిన్నరాజు తదితరులు ఉన్నారు.

'పాలమూరు'కు జాతీయహోదా విస్మరించిన మోదీ

రాష్ట్ర ఎక్సైజ్‌శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): పాలమూరు–రంగారెడ్డికి జాతీయ హోదా ఇస్తానని హామీఇచ్చి విస్మరించిన ప్రధాని మోదీ మరోసారి జిల్లాకు ఏ ముఖం పెట్టుకొని వస్తున్నారని రాష్ట్ర ఎక్సైజ్‌శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. శనివారం తన ఫాం హౌస్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏ చిన్న అవకాశం దొరికినా తెలంగాణపై విషం చిమ్మే ప్రధాని పాలమూర్‌పై పాదం మోపే అర్హత లేదన్నారు. ప్రశాంతంగా ఉన్న పాలమూరులో కులం, మతం పేరిట ప్రజలను రెచ్చగొట్టి అల్లకల్లోలం చేసేందుకు వస్తున్నారని ఆరోపించారు. ఏ ప్రాజెక్టుకు జాతీయహోదా ఇవ్వడం లేదని ప్రకటించిన బీజేపీ సర్కార్ కర్ణాటకలోని అప్పర్‌భద్ర ప్రాజెక్టుకు జాతీయహోదా ఎలా ఇచ్చారని ప్రశ్నించారు. సమైక్య రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న కేఎల్ఐను పూర్తిచేసి సాగు, తాగునీరు అందించిన ఘనత కేసీఆర్‌దేనన్నారు. దేశవ్యాప్తంగా 157 వైద్య కళాశాలలు మంజూరు చేసిన బీజేపీ సర్కారు తెలంగాణకు ఒక్కటంటే ఒక్కటి కూడా ఇవ్వలేదని ఆరోపించారు. బీసీ ప్రధాని అయి ఉండి బీసీ రిజర్వేషన్‌ను అమలు చేయడం లేదన్నారు. తెలంగాణ ప్రజలు కేంద్రానికి చెల్లించిన పన్నుల్లో సగం కూడా తిరిగి ఇవ్వడం లేదని వివరించారు. కృష్ణానది నీటిలో తెలంగాణ వాట తేల్చకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని తెలిపారు. సమావేశంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్వర్‌గౌడ్, జెడ్పీ వైస్ చైర్మన్ యాదయ్య, మున్సిపల్ చైర్మన్ నర్సింహులు, వైస్ చైర్మన్ గణేష్ పాల్గొన్నారు.

రౌడీ షీటర్‌కు రిమాండ్


రౌడీషీటర్ దప్పు కృష్ణను రిమాండ్‌కు తరలిస్తున్న పోలీసులు

జడ్చర్ల: పట్టణంలోని పాతబజార్‌కు చెందిన రౌడీషీటర్ దప్పు కృష్ణను శనివారం రిమాండ్‌కు తరలించినట్లు సీఐ రమేశ్‌బాబు తెలిపారు. సీఐ కథనం ప్రకారం.. స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఎదుట గల ఓ టీ హోటల్‌లో శుక్రవారం నిందితుడు దప్పు కృష్ణ టీ తాగేందుకు వెళ్లిన సమయంలో హోటల్ యజమాని వసీంతో గొడవకు దిగి దాడి చేయడంతో గాయమైంది. దీంతో హోటల్ యజమాని వసీం 100 డయల్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేశాడు. దీంతో కానిస్టేబుళ్లు శ్రీను, వెంకటరమణ హోటల్ దగ్గరకు చేరుకుని గొడవకు సంబంధించి వివరాలు సేకరిస్తుండగా కానిస్టేబుళ్లపై కూడా నిందితుడు చేతులతో వెనక్కి తోసేస్తూ దౌర్జన్యానికి దిగాడు. దీంతో బాధితుడు వసీం ఫిర్యాదు మేరకు దప్పు కృష్ణపై కేసు నమోదు చేశారు. అలాగే భార్య సరితను కొట్టిన సంఘటనకు సంబంధించి దప్పు కృష్ణపై కేసు నమోదు చేశామన్నారు. ఇంతకు ముందే 13 కేసులు ఉన్న దప్పు కృష్ణను రౌడీషీటర్‌గా గుర్తించామని సీఐ తెలిపారు. కాగా నిందితుడు దప్పు కృష్ణ శనివారం జడ్చర్ల పోలీస్‌స్టేషన్‌లో లొంగిపోవడంతో రిమాండ్‌కు తరలించామన్నారు. ఆదివారం రౌడీషీటర్ రిమాండ్‌కు సంబంధించి తహసీల్దార్‌కు సమాచారం ఇస్తామని సీఐ వెల్లడించారు.

జూరాలకు తగ్గిన ఇన్‌ఫ్లో

ధరూరు: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ ప్రాంతం నుంచి వస్తున్న ఇన్‌ఫ్లో తగ్గుముఖం పట్టినట్లు పీజేపీ అధికారులు తెలిపారు. శనివారం రాత్రి 7 గంటల వరకు ప్రాజెక్టుకు 5,800 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తున్నట్లు పీజేపీ అధికారులు పేర్కొన్నారు. ఆవిరి రూపంలో 118, నెట్టెంపాడు ఎత్తిపోతలకు 750, ఎడమ కాల్వకు 1,030, కుడి కాల్వకు 731, ఆర్డీఎస్ లింకు కెనాల్‌కు 150, సమాంతర కాల్వకు 450, భీమా లిఫ్టు–2కు 750 క్యూసెక్కులు ప్రాజెక్టు నుంచి మొత్తం 3,078 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 9.657 టీఎంసీలు కాగా ప్రస్తుతం ప్రాజెక్టులో 9.193 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు పీజేపీ అధికారులు తెలిపారు.

సుంకేసులకు 8వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

రాజోళి: సుంకేసుల డ్యాంకు ఎగువ నుంచి శనివారం 8,520 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చింది. రెండు గేట్లు తెరిచిన అధికారులు 6,710 క్యూసెక్కులను దిగువకు వదిలారు. కేసీ కెనాల్‌కు 1,616 క్యూసెక్కులు వదిలినట్లు జేఈ రాజు తెలిపారు. డ్యాంలో 1.194 టీఎంసీల నీటి నిల్వ ఉంది.

శ్రీశైలంలో 855.5 అడుగులు..

దోమలపెంట: శ్రీశైలం జలాశయంలో శనివారం 855.5 అడుగుల వద్ద 93.1 టీఎంసీల నీటి నిల్వ ఉంది. సుంకేసుల నుంచి 6,710 క్యూసెక్కుల నీటి ప్రవాహం శ్రీశైలం వస్తున్నాయి. 24 గంటల వ్యవధిలో పోతిరెడ్డిపాడు ద్వారా 2,042, మల్యాల ఎత్తిపోతల నుంచి హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్‌కు 1,505, రేగుమాన్‌గడ్డ నుంచి ఎంజీకేఎల్ఐకు 800 క్యూసెక్కుల నీటిని వదిలారు. భూగర్భ కేంద్రంలో 0.674 మిలియన్ యూనిట్లు ఉత్పత్తి చేసి 1,296 క్యూసెక్కుల నీటిని సాగర్‌కు వదిలారు. జలాశయంలో 99 క్యూసెక్కుల నీరు ఆవిరైంది.

మదనాపురం: రామన్ పాడు జలాశయంలో శనివారం పూర్తిస్థాయి నీటిమట్టం 1,020 అడుగులకు వచ్చి చేరింది.

బీజేపీలో రైతురాజ్యం పార్టీ విలీనం

జడ్చర్ల టౌన్: రైతురాజ్యం పార్టీని బీజేపీలో విలీనం చేసినట్లు ఆ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎంబీ బాలకృష్ణ శనివారం విలేకరులకు తెలిపారు. బీజేపీ చేరికల కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్, పార్టీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ సమక్షంలో పార్టీని విలీనం చేసినట్లు స్పష్టం చేశారు. ఇకపై బీజేపీలో కొనసాగుతూ రైతుల ప్రయోజనాల కోసం పోరాడుతామని వెల్లడించారు.